# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 19 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## రాజీవ్ గాంధీ ఎయిర్‌పోర్టుకు గ్లోబల్ గుర్తింపు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జిఐఎ) గ్లోబల్ గుర్తింపు పొందింది. ఎయిర్‌పోర్టు కార్బన్ అక్రెడిటేషన్ (ఏసిఏ) ప్రోగ్రాంలో అత్యున్నతమైన లెవల్ 5 కార్బన్ అక్రెడిటేషన్‌ను ఎయిర్‌పోర్ట్ కౌన్సిల్ ఇంటర్నేషనల్‌తో ఈ గుర్తింపును దక్కించుకుంది. విమానాశ్రయాలు తమ కార్బన్ ఉద్గారాలను తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలను అంచనా వేయడానికి ఈ ఏసిఏ ప్రోగ్రాం స్టాండర్డ్‌గా పరిగణిస్తారు. ఇందులో మొత్తం ఏడు స్థాయిలు ఉంటాయి. లెవల్ ఒకటిలో మ్యాపింగ్, లెవల్ 2లో రిడక్షన్, లెవల్ 3లో ఆప్టిమైజేషన్, లెవల్ 3ంలో న్యూట్రాలిటి, లెవల్ 4లో ట్రాన్స్‌ఫార్మేషన్ , లెవల్ 4ంలో ట్రాన్సిషన్, అత్యున్నతమైన లెవల్ 5 గుర్తింపు ఇస్తారు. ఈ లెవల్ 5 గుర్తింపులో భాగంగా జిహెచ్ఐఏఎల్ విమానాశ్రయం ఏసిఐ ఆసియా–పసిఫిక్ అండ్ మిడ్లీస్ట్ ప్రాంతంలో ఈ స్థాయిని పొందిన టాప్ నాలుగు విమానాశ్రయాల్లో ఒకటిగా నిలిపింది. ఇది ఆర్‌జిఐఏ గ్లోబల్ క్లైమేట్ గోల్స్‌తో అనుసంధానమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందని శంషాబాద్ విమానాశ్రయ అధికారులు తెలిపారు. స్కోప్ 1, స్కోప్ 1లో భాగంగా కార్బన్ ఉద్గారాలను నెట్ జీరో స్థాయిలో కొనసాగించడమే కాకుండా, 2050 లేదా అంతకంటే ముందే స్కోప్ 3లో ఉద్గారాలను నెట్ జీరోగా మార్చే దిశగా ఈ ఎయిర్‌పోర్టు కృషి చేసిందని ఏసిఏ ప్రోగ్రాం తన స్టాండర్డ్‌తో పేర్కొంది.

# వర్ష బీభత్సం



- రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం
- కూలిన చెట్లు, తెగిపడిన వైర్లు
- పలుచోట్ల విద్యుత్ అంతరాయాలు
- హైదరాబాద్‌లో దంచి కొట్టిన వాన
- స్తంభించిన ట్రాఫిక్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**


హైదరాబాద్ తోపాటు తెలంగాణ జిల్లాల్లోనూ వర్షాలు కురిశాయి. హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నగరంలోని చాలా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు, ఈదురు గాలులు వీయడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, నాంపల్లి, హిమాయత్ నగర్?, ముషీరాబాద్, విద్యానగర్, రామ్ నగర్, ఖైరతాబాద్, మియాపూర్, దిల్‌సుఖ్‌నగర్‌లో ఒక్కసారిగా ఈదురు గాలులలో వాన కురిసింది. గాలుల ఉధృతి తీవ్రంగా ఉండటంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కుత్బుల్లాపూర్, దుండిగల్, సుచిత్ర, కొంపల్లి, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లోనూ ఈదురుగాలులతో మోస్తరు వర్షం పడుతోంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియా పరిధిలో ముందుగా ఈదురుగాలులు భయంకరమైన వాతావరణం సృష్టించాయి. తరువాత భారీ వర్షం కురిసింది. అమీర్‌పేట్, పంజాగుట్ట, మధుర నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పరిసరాల ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఈదురుగాలులు వీస్తుండటంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. హైదరాబాద్ తోపాటు తెలంగాణలోని ఇతర జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి.

ఎస్ఆర్ నగర్, బోరబండ, జూబ్లీహిల్స్, కోఠి, నాంపల్లి, హిమాయత్‌నగర్, కార్వాన్, కుత్బుల్లాపూర్, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. దాంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. సాయంత్రం వేళ వాన కురవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాంపల్లి రెడ్‌హిల్స్‌లో రోడ్డుపై ఓ భారీ వక్షం కూలిపోయి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడడంతో అది ఒక్కసారిగా పేలిపోయింది. అస్మాన్‌గఢ్ విద్యుత్ డివిజన్ పరిధిలో 67 ఫీడర్లు ట్రిప్ అయ్యాయి. బషీర్‌బాగ్‌లో పీజీ లా కాలేజ్ ఎదుట రోడ్డుపై ఓ చెట్టు కూలిపోయింది. ట్యాంక్ బండ్ నుంచి లోయర్ ట్యాంక్‌బండ్ వెళ్లే రోడ్డులో కూడా చెట్టు కూలిపోయి.. వాహనాలు భారీగా నిలిచిపోయాయి. లంగర్ హౌస్ బాపునగర్ కాలనీలో చెట్టు కూలి.. రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి.

# హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్

## రాష్ట్రానికి మరో రూ.10,500 కోట్ల పెట్టుబడులు

- 400 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన ఏఐ డేటా సెంటర్ క్లస్టర్
- జపాన్‌లో ముఖ్యమంత్రి సమక్షంలో పెట్టుబడులు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జపాన్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం రాష్ట్రానికి మరో రూ.10,500 కోట్ల భారీ పెట్టుబడిని సాధించింది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఐటీ సేవల్లో ప్రపంచ ప్రఖ్యాతి గడించిన ఎన్‌టీటీ డేటా, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్‌వర్క్స్‌లు సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయి. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి రూ.10,500 కోట్ల పెట్టుబడితో ఈ క్లస్టర్‌ను నిర్మించేందుకు త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఎన్‌టీటీ డేటా, నెయిసా నెట్‌వర్క్స్‌ల నుంచి బోర్డు సభ్యుడు కెన్ కట్సుయామా గారు, డైరెక్టర్ తడావోకి నిషిమురా గారు, ఎన్‌టీటీ గ్లోబల్ డేటా సెంటర్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ బాజ్‌పాయ్ గారు, నెయిసా సీఈవో, ఎన్‌టీటీ గ్లోబల్ డేటా ఛైర్మన్ శరద్ సంఘీ గారు ఈ ఒప్పందంలో పాల్గొన్నారు.

ఈ ఒప్పందం ద్వారా హైదరాబాద్‌లో 400 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ నిర్మితమవుతుంది. 25,000 జీపీయూలతో భారతదేశంలోనే అత్యంత శక్తివంతమైన ఏఐ సూపర్‌కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను ఈ క్లస్టర్ అందిస్తుంది.తెలంగాణను దేశంలో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు రూపొందుతోంది. ఎన్‌టీటీ డేటా, నెయిసా కంపెనీలు సంయుక్తంగా ఏఐ–ఆధారిత సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేసేందుకు ఈ క్లస్టర్ ఆవిష్కరణల కేంద్రంగా నిలుస్తుంది.

ఈ ఏఐ డేటా సెంటర్ క్లస్టర్‌ను 500 మెగావాట్ల వరకు గ్రిడ్ విద్యుత్‌తో, మిగిలినది పునరుత్పాదక శక్తి ద్వారా నిర్వహిస్తారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంభిస్తారు. ఈ ప్రాజెక్టును ఉన్నత ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్, గవర్నెన్స్) ప్రమాణాలతో అభివృద్ధి చేస్తారు. తెలంగాణలోని విద్యా సంస్థలతో భాగస్వామ్యంతో ఈ క్యాంపస్ ఏఐ ప్రతిభను పెంపొందిస్తుంది మరియు రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదపడుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పెట్టుబడి ఒప్పందంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిల్ విండో విధానంలో అనుమతులతో పాటు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ప్రతిభావంతులైన నిపుణులు ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో తెలంగాణను అగ్రగామిగా నిలిపాయన్నారు.ఎడబ్ల్యూఎస్, ఎస్‌టీటీ, టిల్‌మన్ హోల్డింగ్స్, సీటీఆర్ఎల్ఎస్ వంటి దిగ్గజ కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టులతో పాటు, ఎన్‌టీటీ డేటా భారీ పెట్టుబడి ఒప్పందంతో హైదరాబాద్ దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్‌గా మరింత బలపడిందని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు.టోక్యోలో ప్రధాన కార్యాలయం కలిగిన ఎన్‌టీటీ డేటా, ఐటీ సేవలు, డేటా సెంటర్లు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో ప్రముఖ సంస్థ. 50కి పైగా దేశాల్లో 193,000 మంది ఉద్యోగులతో, ప్రపంచంలోని టాప్ 3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఒకటిగా నిలుస్తుంది. పబ్లిక్ సర్వీసెస్, బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, టెలికాం రంగాలకు సేవలు అందిస్తుంది. నెయిసా నెట్‌వర్క్, ఏఐ–ఆధారిత క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థగా, నిర్దిష్ట ఏఐ కంప్యూట్ సొల్యూషన్స్‌పై దృష్టి సారిస్తుంది.

## సంగారెడ్డి జిల్లాలో తోషిబా కొత్త ఫ్యాక్టరీ



- రూ.562 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రఖ్యాత తోషిబా కార్పొరేషన్ అనుబంధ సంస్థ తెలంగాణలో కొత్తగా రూ.562 కోట్ల భారీ పెట్టుబడితో మరో ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం జపాన్ పర్యటనలో భాగంగా ఈ భారీ పెట్టుబడిని రాబట్టింది. జపాన్‌కు చెందిన మల్టీనేషన్ దిగ్గజం తోషిబా కార్పొరేషన్ అనుబంధ సంస్థ అయిన, తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (టీటీడీఐ) రూ.562 కోట్లతో సంగారెడ్డి జిల్లా రుద్రారంలో కొత్త ఫ్యాక్టరీని నెలకొల్పేందుకు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.

విద్యుత్ సరఫరా, పంపిణీ రంగంలో పెట్టుబడులను, ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ ఒప్పందం ద్వారా ముందడుగు వేసింది. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో తోషిబా కార్పొరేషన్ ఎనర్జీ బిజినెస్ డైరెక్టర్ హిరోషి కనెటా గారు, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్ గారు, టీటీడీఐ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్

మిగితా 2వ పేజీలో

## ఎప్‌సెట్‌కు 3,05,774 మంది దరఖాస్తు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్‌కు 3,05,774 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జేఎన్టీయూలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ టి కిషన్‌కుమార్ రెడ్డి, ఎప్‌సెట్ కోకన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగానికి 2,19,420 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 86,101 మంది, రెండింటికీ 253 మంది కలిపి మొత్తం 3,05,774 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుంతో ఈనెల 24 వరకు దరఖాస్తులను సమర్పించొచ్చని సూచించారు. మరో 500 మంది దరఖాస్తు చేసే అవకాశముందని చెప్పారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు 112 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తామని అన్నారు. వచ్చేనెల 2, 3,4 తేదీల్లో ఇంజినీరింగ్ విభాగం పరీక్షలను 124 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తామని వివరించారు. ప్రతిరోజూ రెండు విడతల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తామని అన్నారు. ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రెండో విడత పరీక్షలను చేపడతామని చెప్పారు. బయోమెట్రిక్ హాజరు విధానం ఉన్నందున అభ్యర్థులను పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందునుంచే అనుమతిస్తామని అన్నారు. మొదటి విడత పరీక్షకు ఉదయం 7.30 గంటల నుంచే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని వివరించారు. రెండో విడత పరీక్షకు మధ్యాహ్నం 1.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందన్నారు. మొదటి విడతకు ఉదయం తొమ్మిది గంటలకు, రెండో విడతకు మధ్యాహ్నం మూడు గంటలకు నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఒకరోజు ముందే పరీక్షా కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు. మొదటిసారిగా హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించామని చెప్పారు. అభ్యర్థులు స్కాన్ చేసి ఇంటినుంచి పరీక్షా కేంద్రానికి దూరంతోపాటు ఎంత సమయంలో చేరుకోవచ్చో తెలుసుకోవచ్చని సూచించారు. శనివారం నుంచి అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం అభ్యర్థులు, ఈనెల 22 నుంచి ఇంజినీరింగ్ విభాగం అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని చెప్పారు. అభ్యర్థులు హాల్‌టికెట్లను ముందే డౌన్‌లోడ్ చేసుకోవాలనీ, ఏమైనా తప్పులుంటే

మిగితా 2వ పేజీలో

## ఉన్నత విద్య సంస్కరణల బిల్లు రూపొందిస్తున్నాం

- ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ బాలకిష్టారెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ఉన్నత విద్య సంస్కరణల బిల్లును రూపొందిస్తున్నామని ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ వి బాలకిష్టారెడ్డి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ప్రయివేటు విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలపై ఉన్నత విద్యామండలికి ఎలాంటి నియంత్రణ, అధికారాల్లేవని అన్నారు. అవి తప్పు చేసినా, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసినా చర్యలు తీసుకునే అవకాశం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఈ అంశంపై సమాలోచన చేశామన్నారు. ప్రయివేటు విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలతోపాటు ప్రయివేటు విద్యాసంస్థలను నియంత్రించే అధికారంతోపాటు పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. అందులో భాగంగానే తెలంగాణ ఉన్నత విద్య సంస్కరణల బిల్లును రూపొందిస్తున్నామని వివరించారు. ఉన్నత విద్యామండలికి అధికారాలను కట్టబెడుతూ ఈ బిల్లు ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ–2020) కంటే మెరుగైన విద్యావిధానాన్ని రూపొందిస్తామని వివరించారు. ఇంజినీరింగ్ సహా వృత్తి విద్యా కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోయినా ధ్రువపత్రాలను ఇవ్వాల్సిందేనని బాలకిష్టారెడ్డి చెప్పారు. యూజీసీ నిబంధనల ప్రకారం ధ్రువపత్రాలను తప్పనిసరిగా విద్యార్థులకు ఇవ్వాలని అన్నారు. కొన్ని కాలేజీల యాజమాన్యాలు ధ్రువపత్రాలను ఇవ్వకుంటే విద్యార్థులు తమను ఆశ్రయిస్తే కాలేజీలతో సంప్రదించి లేఖ రాసి ఇప్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని వివరించారు. అయితే ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది ప్రభుత్వ విధానమని అన్నారు. బకాయిలపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

## మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభపై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ మహిళా నేతలతో పాటు పలువురు నాయకులతో పార్టీ అధినేత కేసీఆర్ సమావేశమయ్యారు. సభలో మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, సభ విజయవంతంలో వారి భాగస్వామ్యం, అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణకు సంబంధించిన తగిన సూచనలు చేస్తూ కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు, పార్టీ మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన వారిలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీష్ కుమార్, పార్టీ మహిళా నేతలు మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, టీఎస్‌పీఎస్సీ మాజీ మెంబర్ సుమిత్రా తనోబా, గిడ్డంగుల శాఖ మాజీ ఛైర్ పర్సన్ రజినీ సాయిచంద్, నవీన్ ఆచారి, పార్టీ నేతలు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాదరి బాలమల్లు, కల్వకుంట్ల వంశీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## భగవద్గీతకు యునెస్కో గుర్తింపు

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

న్యూఢిల్లీ: భగవద్గీత, భరతముని రచించిన నాట్యశాస్త్రానికి యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు లభించింది. ఈ విషయాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దీనిపై ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన విషయమని అన్నారు. "భారతీయ జ్ఞాన సంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోంది. ఈ రచనలు మన దేశంపై ప్రపంచ దక్పథానికి, మన జీవన విధానానికి పునాదులు. ఇప్పటివరకు మన దేశం నుంచి 14 శాసనాలు.. యునెస్కో రిజిస్టర్‌లో చోటు దక్కించుకున్నాయి" అని కేంద్రమంత్రి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. దీనిపై ప్రధాని మోడీ స్పందించారు. "ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. భగవద్గీత, నాట్యశాస్త్రాన్ని యునెస్కో రిజిస్టర్‌లో చేర్చడమనేది.. మన జ్ఞాన సంపద, సంస్కృతికి లభించిన గుర్తింపు. ఇవి శతాబ్దాలుగా మన నాగరికత, ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాయి. ప్రపంచానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి" అని సంతోషం వ్యక్తం చేశారు.

## గ్రూప్-1 రద్దుచేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలి..

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



గ్రూప్–1 నోటిఫికేషన్‌ను రద్దుచేసి పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. గ్రూప్–1 నిర్వహించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగుల జీవితాలు అగాధంలోకి నెట్టి వేయబడ్డాయని చెప్పారు. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీ లోపించిందని విమర్శించారు. యువత జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడడం ఆక్షేపనీయమన్నారు. గ్రూప్ –1 పరీక్ష నిర్వహించిన తీరు, ఫలితాల వెల్లడిపై అభ్యర్థుల్లో అనేక సందేహాలున్నాయని చెప్పారు. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్ నెంబర్ల కేటాయింపుతో గందరగోళం నెలకొందన్నారు. జవాబు పత్రాల మూల్యాంకనంపైనా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని వెల్లడించారు. అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న ఆందోళన ధర్మబద్ధమని హైకోర్టు కూడా గుర్తించి నియామకాల ప్రక్రియకు బ్రేకులు వేసిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యమనే విషయాన్ని ప్రభుత్వ పెద్దలు గుర్తించాలన్నారు.

## తెలంగాణలో బెంగాల్ తరహా పరిస్థితులు రాబోతున్నాయి

- బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




త్వరలోనే బెంగాల్ తరహా పరిస్థితులు తెలంగాణ రాష్ట్రంలో రాబోతున్నాయని బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ ఆఫీస్ లో బండి సంజయ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ు. సోనియా దాదాపు రూ.2 వేల కోట్ల ప్రభుత్వ సంపదను కాజేసే ప్రయత్నం చేసారంటూ ఆరోపించారు. కాంగ్రెస్ దేశ సంపదను దోచుకునేందుకు సిద్ధమైయిందన్నారు. ఈ కేసు బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటిది కాదని, 2011లో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే సీబీఐ దర్యాప్తు మొదలైందని గుర్తు చేశారు. ఆ సమయంలోనే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఈ కేసులో బెయిల్ పొందారని తెలిపారు. అంతేకానీ ఇది బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టిన కేసులా కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారన్నారు. ఈ కేసుతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ దేశ చట్టాలు సోనియాకు, రాహుల్ కు వర్తించవా అంటూ ఆయన ప్రశ్నించారు. తప్పు చేసిన వారు బయట స్వేచ్ఛగా తిరుగుతున్నారని.. న్యాయస్థానాలపై ప్రజలకు నమ్మకం ఉండటం లేదని వెల్లడించారు.

ప్రభుత్వ సహకారంతో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్రంలో ఆందోళనలు జరుగుతాయన్నారు. ఇది కంట్రోల్ తప్పితే శాంతి భద్రత సమస్యలు తలెత్తుతాయని అన్నారు. అటు నేషనల్ హెరాల్డ్ కేసు ఇష్యూపై కాంగ్రెస్ పార్టీ చేసిన ధర్నా మీద బండి సంజయ్ సెటైర్లు వేశారు. అదొక బూతు ధర్నా.. బూతు మాటలు తప్ప అందులో సాధించిందేమీ లేదని చురకలు అంటించారు. దాన వీర శూర కర్ణలో అన్ని పాత్రలు ఎన్టీఆర్ ఒక్కరే పోషించినట్టు.. కాంగ్రెసోళ్లు కూడా హీరోలు, విలన్లు, బ్రోకర్లు, జోకర్లంటూ చురకలు అంటించారు కేంద్ర మంత్రి బండి సంజయ్.ఇక అటు బండి సంజయ్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్. బండి సంజయ్ మాట్లాడేటప్పుడు కేంద్ర మంత్రి అనే విషయం కూడా మర్చిపోతాడు.. పూనకంలో ఏం మాట్లాడుతాడో కూడా ఆయనకే తెలియదని చురకలు అంటించారు మహేష్ కుమార్ గౌడ్.

# తెలంగాణకు పెట్టుబడులతో రావాలి

● జపాన్ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం




**బలగం టీవి, హైదరాబాద్**
తెలంగాణకు పెట్టుబడులతో రావాలని, చైనా ప్లస్ వన్ ప్రత్యామ్నాయంగా ఎదుగుతోన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చెందాలని జపాన్ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం పలికారు. టోక్యోలోని హోటల్ ఇంపీరియల్‌లో జరిగిన ఇండియా–జపాన్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ రోడ్‌షోలో ముఖ్యమంత్రి గారి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ అధికారిక బృందం రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనేక అవకాశాలను సమగ్రంగా వివరించింది.

వివిధ రంగాలకు చెందిన 150 మందికి పైగా జపాన్ పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ వ్యాపారవేత్తలను ముఖ్యమంత్రి గారు సాదరంగా ఆహ్వానించారు. "భారతదేశంలోనే అతిపిన్న రాష్ట్రమైన తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతూ మీకు హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నది. జపాన్‌ను 'ఉదయించే సూర్యుడి దేశం' అని పిలుస్తారు. మా ప్రభుత్వ నినాదం 'తెలంగాణ రైజింగ్'. ఈ రోజు తెలంగాణ జపాన్‌లో ఉదయిస్తున్నది," అని ఉద్ఘాటించారు. "టోక్యో చాలా గొప్ప నగరం. ఇక్కడి మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలు అద్భుతం. జపాన్ ప్రజల సౌమ్యత, మర్యాద, క్రమశిక్షణ నన్ను ఎంతగానో ఆకర్షించాయి. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంలో టోక్యో నుంచి మేము చాలా నేర్చుకున్నాము," అని పేర్కొన్నారు. లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, టెక్స్‌టైల్స్, ఏఐ డేటా సెంటర్స్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో నిధులు పెట్టాలని జపాన్ పారిశ్రామికవేత్తలను సీఎం గారు కోరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, స్థిరమైన విధానాలను అందిస్తుందని వారికి భరోసా ఇచ్చారు. "భారత్, జపాన్ కలిసి ప్రపంచానికి ఉజ్వల భవిష్యత్తును నిర్మిద్దాం," అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జపాన్‌లోని భారత రాయబారి సిబి జార్జ్ గారు మాట్లాడుతూ, భారత్–జపాన్ మధ్య బలపడుతున్న ఆర్థిక సంబంధాలను వివరించారు. జెట్రో (జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) బెంగళూరు డైరెక్టర్ జనరల్ తోషిహిరో మిజుటానీ గారు మాట్లాడుతూ, తెలంగాణతో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భావిస్తున్నట్టు చెప్పారు. ఇదే వేదికపై తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్మిస్తున్న దేశంలోనే మొదటి నెట్ జీరో ఇండస్ట్రియల్ సిటీ 'ఫ్యూచర్ సిటీ' మరియు మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్‌లకు సంబంధించిన ప్రచార వీడియోలను ప్రదర్శించారు. ఎలక్ట్రానిక్స్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, టెక్స్‌టైల్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణం, అవకాశాలను రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ గారు వివరించారు. రోడ్‌షో అనంతరం, తెలంగాణ ప్రతినిధి బృందం జపాన్‌లోని పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించింది, భవిష్యత్ సహకార అవకాశాలను చర్చించింది.

# రైతుల కళ్లలో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం 2025 సామాన్య రైతులకు న్యాయం జరిగేవిధంగా ఉంటుందని, రైతుల కళ్లలో ఆనందం చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్మని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి కార్యక్రమంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన భూ భారతి రెవన్యూ సదస్సుకు రాష్ట్ర రెవన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అటవీ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ బుద్ద ప్రకాష్ లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై భూ భారతి రెవెన్యూ సదస్సును ప్రారంభించి మాట్లాడుతూ దేశానికి వెన్నుముక రైతు అని, రైతు లేనిదే రాజ్యం లేదన్నారు.

బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుల సమస్యలు తీర్చుతామంటూ 2020 సంవత్సరంలో ధరణి పోర్టల్ తీసుకువచ్చి గులాబీ నాయకులు ఇష్టా రీతిని వారి పేర్లపై వందల ఎకరాలు పట్టాలు చేయించుకుని, చట్టాన్ని చుట్టంగా మలుచుకుని రైతు బంధు పొందారు తప్పా సామన్య పేదరైతుకు న్యాయం జరిగిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడగానే ధరణి పోర్టల్ ను బంగాళాఖాతంలో కలిపి సామాన్య రైతుకు శాశ్వత పరిష్కారం అయ్యే విధంగా భూ భారతి చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చిన మేరకు భూ భారతి చట్టం 2025 తీసుకువచ్చామని పైలట్ ప్రాజెక్టుగా ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండలాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సాదా బైనామాద్వారా రైతులు పెట్టుకున్న దరఖాస్తులు రాష్ట్ర వ్యాప్తంగా 9 లక్షల 24 వేలు ఆన్‌లైన్ లో ఉన్నాయని, అన్నింటికీ భూ భారతిలో అవకాశం కల్పించి రైతులకు న్యాయం జరిగేవిధంగా కృషి చేస్తామన్నారు. పేదల ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం అని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా భూ భారతి చట్టం రూపొందించి, చట్టం చేసిన 90 రోజుల్లోనే విధి, విధానాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భూ భారతి పోర్టల్‌లో రైతు సమస్యలపై దరఖాస్తు చేస్తే ముందుగా తహశీల్దార్ పరిధిలో ఉంటుందని, తహశీల్దార్ చేయకపోతే ఆర్డీఓ, అదనపు కలెక్టర్ సరిచేయాలని, కలెక్టర్ చొరవ తీసుకుని పరిష్కారం చూపాలని చూపినట్లయితే ఉమ్మడి జిల్లాకు ఒక సిసిఎల్ఏ, ట్రిబ్యునల్ ఏర్పాటు చేయనున్నట్లు అందులో సమస్యలకు పరిష్కారం అయ్యే విధంగా ఉంటుందని అన్నారు. రైతుల సమస్యలు పరిష్కారం కాకపోతే హైదరాబాద్‌లోని రెవెన్యూ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. రైతుల సమస్యలు తీర్చడానికి భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం రూపొందించడం జరిగిందని, చట్టాన్ని అమలు చేసే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. అధికారులు నిబద్ధతలో పనిచేయాలని, గ్రామాల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి స్వయంగా కలెక్టర్లు వెళ్లి రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.

గత బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు చెప్పిన మాట వినలేదని విఆర్వో, విఆర్ఏ వ్యవస్థను రద్దు చేసి, 23 వేల మంది ఉద్యోగులను రోడ్డు పాలు చేసారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ భూములను కాపాడేందుకు ఒక అధికారి ఉండాలనే ఉద్దేశంతో తిరిగి గ్రామపాలనాధికారుల వ్యవస్థ తీసుకురావడం జరిగిందన్నారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి రెవెన్యూ అధికారులు వచ్చి రైతుల సమస్యలు పరిష్కంచేందుకు కృషి చేస్తారన్నారు. పేదవారికి, సామాన్య రైతులకు ఉపయోగపడే విధంగా భూ భారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



## టోక్యో వాటర్ ఫ్రంట్‌ను సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం జపాన్‌లోని టోక్యో వాటర్ ఫ్రంట్‌ను సందర్శించింది. టోక్యో మహానగరం మధ్య నుంచి పారే సుమిదా నది రివర్ ఫ్రంట్‌గా అభివృద్ధి చేసిన తర్వాత పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. టోక్యో నగరం మధ్యన జల రవాణాకు అనుగుణంగా రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడం, సుమిదా నది పక్క నుంచి పొడవాటి ఫ్లైఓవర్, అవసరమైన చోట ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు టోక్యో నగర రూపురేఖలను ఎలా మార్చిందీ ఈ ప్రతినిధి బృందం పరిశీలించింది. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం టోక్యో రివర్ ఫ్రంట్‌ను క్షణ్ణంగా పరిశీలించింది.



## సంగారెడ్డి జిల్లాలో తోషిబా కొత్త ఫ్యాక్టరీ

(మొదటి పేజీ తరువాయి)

హిరోషి పురుటా ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం సంగారెడ్డి జిల్లా రుద్రారంలో టీటీడీఐ సర్జ్ అరెస్టర్స్ తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనుంది. అదే విధంగా, పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్, గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గేర్ (జీఐఎస్) తయారీ సామర్థ్యాన్ని విస్తరించేందుకు ఇప్పటికే ఉన్న ఫ్యాక్టరీలను ఆధునీకరించనుంది. ఈ ప్రాజెక్టు కోసం తోషిబా సంస్థ రూ.562 కోట్ల పెట్టుబడి కేటాయించనుంది. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించే ఈ కొత్త ఫ్యాక్టరీ విద్యుత్ రంగంలో పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడమే కాక, గణనీయమైన ఉద్యోగ అవకాశాలను సృష్టించనుంది.

రుద్రారంలో ఇప్పటికే రెండు ఫ్యాక్టరీలను విజయవంతంగా నిర్వహిస్తున్న టీటీడీఐ, ఈ కొత్త పెట్టుబడితో మూడవ ఫ్యాక్టరీని నెలకొల్పడంతో పాటు, ప్రస్తుత ఫ్యాక్టరీల సామర్థ్యాన్ని విస్తరించనుంది. ఈ ఒప్పందం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో ఉందని, పరిశ్రమల భాగస్వామ్యం, వ్యూహాత్మక సహకారాల ద్వారా ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని, తోషిబాతో ఈ ఒప్పందం పారిశ్రామిక రంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని అన్నారు. టీటీడీఐ చైర్మన్ హిరోషి పురుటా గారు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు తమను ఆకర్షించాయని, ఆవిష్కరణల పట్ల ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధత తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చిందని, ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఉత్సాహంగా ఉన్నామని తెలిపారు.

## ఎప్‌సెట్‌కు 3,05,774 మంది దరఖాస్తు

(మొదటి పేజీ తరువాయి)

సరిదిద్దుకోవాలని సూచించారు. అభ్యర్థులు బ్లాక్/బ్లూ బాల్‌పాయింట్ పెన్ను, హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని కోరారు. పరీక్షా కేంద్రాల్లోకి క్యాలిక్యులేటర్లు, మ్యాథమెటికల్/లాగ్ టేబుల్స్, పేజర్లు, సెల్‌ఫోన్లు, చేతిగడియారాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావడాన్ని నిషేధించామని అన్నారు. ఇతర వివరాల కోసం https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, జేఎన్టీయూ హైదరాబాద్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష

**బలగం టీవి, హైదరాబాద్**
బీసీ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి సంబంధించి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి సైదులు ప్రకటనలో తెలిపారు. మొత్తం 6,832 బ్యాగ్ లాగ్ సీట్లుండగా, 26,884 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు రాష్ట్రవ్యాప్తంగా 109 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు.

# భోజనాలు ఎలా ఉన్నాయి..

**-ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, సిరిసిల్ల**

మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా, నాణ్యత ఎలా ఉంది అని విద్యార్థులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆరా తీశారు. శుక్రవారంవీర్నపల్లి మండలంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యటించారు. ముందుగా వీర్నపల్లిలో రూ. 40 లక్షల నిధులతో స్వశక్తి భవన నిర్మాణానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన..**

అనంతరం కలెక్టర్ లాల్ సింగ్ తండాలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా గ్రౌండింగ్ పూర్తయి పనులు మొదలుపెట్టిన వారి నిర్మాణాలను పరిశీలించారు. అలాట్మెంట్ ఆర్డర్ పొందిన వారందరూ త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం 4 విడుతల్లో అందించే రూ ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం నిర్మాణాలను చేసుకోవాలని అన్నారు.మొత్తం 107 ఇండ్లకు అలాట్మెంట్ ఇవ్వగా, ఇప్పటిదాకా 20 గ్రౌండింగ్ పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.



**భోజనాలు ఎలా ఉన్నాయి..**

ఈ సందర్భంగా కలెక్టర్ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వంటగదిలో సరుకులు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు అనంతరం విద్యార్థులతో మాట్లాడారు.

**పీహెచ్సీలో తనిఖీ**

మండల కేంద్రంలోని పీహెచ్సీలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్, సిబ్బంది రిజిస్టర్ లను పరిశీలించారు. అనంతరం వ్యాక్సిన్ ల గడువు తేదిని తనిఖీ చేశారు. ప్రభుత్వ వైద్య సేవలపై అందరికీ అవగాహన కల్పించాలని, సర్కార్ దవాఖానాల్లోనే ప్రసవాలు చేసుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, డీఆర్డీఓ శేషాద్రి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి రాందాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ప్రజా ప్రతినిధులు కే కే మహేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాముల నాయక్, సెస్ డైరెక్టర్ మల్లేష్ యాదవ్, తహసిల్దార్ మక్తర్ పాషా, ఎంపీడీఓ అబ్దుల్ వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించాలి..

**-24 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు లక్ష రూపాయల నిధులు విడుదల..**

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో బేస్మెంట్ వరకు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న 24 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు లక్ష రూపాయల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ప్రభుత్వం ప్రతి మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసిందని, మన రాజన్న సిరిసిల్ల జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద మొత్తం 1023 ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ చేశామని అన్నారు. జిల్లావ్యాప్తంగా పంపిణీ చేసిన ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ లలో 300 ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, వీటిలో బేస్మెంట్ వరకు పనులు పూర్తి చేసుకున్న 24 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మొదటి విడత ఆర్థిక సహాయం లక్ష రూపాయలు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేసిందని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లు ప్రొసిడింగ్స్ పొందిన లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించు కోవాలని, ప్రభుత్వం నాలుగు దశలలో ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేస్తుందని, హౌసింగ్ శాఖ అధికారులు నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వేగంగా నిర్మించుకునేలా చూడాలని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## జై భీం జై బాపు జై సంవిధాన్ పాదయాత్ర ప్రారంభం

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన దేశవ్యాప్త పాదయాత్ర జై భీం జై బాపు జై సంవిధాన్ కార్య క్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఈ యాత్రను జాతి పిత మహాత్మా గాంధీకి మరియు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్కి పూల మాలలు వేసి ప్రారంభించడం జరిగింది. ప్రైమరీ స్కూల్ నుండి బస్ స్టాండ్ వరకు ఈ యాత్ర చేపట్టి కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఆశయాలను రాజ్యాంగ పరిరక్షణకు పాటు పడాలని మరియు తెలంగాణ ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన వివిధ రకాల అభివృద్ధి కార్య క్రమాలు వివరిస్తూ... మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మరెడ్డి, బ్లాకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొమ్మట నర్సయ్య మాట్లాడుతూ.... ఆరు గ్యారంటీ ల గురించి తెలియజేయడం జరిగింది.. ఇట్టి కార్యక్రమంలో మండల నాయకులు ఎఎంసి వైస్ చైర్మన్ రాంరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గౌస్, డైరెక్టర్లు, బండలింగంపల్లి




గ్రామశాఖ అధ్యక్షుడు రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు జంగ అంజిరెడ్డి, ఎఎంసి డైరెక్టర్ జంగా శ్రీకాంత్ రెడ్డి, బాలచందర్ , హైమద్, ఏళ్ల గౌడ్, మై ఫౌస్, శ్రీనివాస్ రెడ్డి, చంద్రయ్య,బుచ్చిరెడ్డి,బాల్ చెందర్ రెడ్డి, సంజీవ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండె రాజు రెడ్డి, ప్రశాంత్ రెడ్డి ప్రవీణ్ రెడ్డి, ముస్లిం సోదరులు హస్సెన్.ఇర్ఫాన్, కార్య కర్తలు తది తరులు



## ట్రాక్టర్ దొంగల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

**-సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి.**

**బలగం టీవీ, ముస్తాబాద్**

ట్రాక్టర్ దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సి ఐ మొగిలి తెలిపారు. ముస్తాబాద్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో సీఐ మొగిలి మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. గత ఫిబ్రవరి నెలలో శుభోధం సమైక్యసంఘం చెందిన ఐచర్ ట్రాక్టర్ తో పాటు కాజా కుట్టు మిషన్ చోరీకి గురిందని అధ్యక్షురాలు దేవిక ఫిర్యాదు మేరకు ఎస్సై గణేష్ కేసు నమోదు చేశారని అన్నారు. దర్యాప్తులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ముస్తాబాద్ కు చెందిన షాదుల్, నరేందర్ రెడ్డి, సిద్దిపేటకు చెందిన సమీర్ లను అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద నుండి ఐచర్ ట్రాక్టర్ తో పాటు కాజా కుట్టు మిషన్ స్వాధీనం చేసుకున్నామని అన్నారు. దొంగతనానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనం,కారు మరియు మూడు సెల్ ఫోన్లు సీజ్ చేసి పై ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని అన్నారు.వీరికి సహకరించిన రావూరుకుల గ్రామానికి చెందిన మల్లేశం పరారీలో ఉన్నడని తెలిపారు. ముగ్గురు నిందితులు జలసాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నారని అన్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ముస్తాబాద్ పోలీస్ సిబ్బంది సిఐ అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ గణేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## బీసీలకు ప్రత్యేకమైన అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలి..

**బలగం టీవీ, బోయినిపల్లి**

చట్టసభలలో బీసీలకు ప్రత్యేకమైన అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గల బిల్లు తీసుకువచ్చి అమలు చేయాలని బీసీ రాజ్యాధికార సమితి చొప్పదండి నియోజకవర్గం ఇన్చార్జ్ అతికం రాజశేఖర్ గౌడ్ అన్నారు.బోయినిపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో బీసీలకు ప్రత్యేకమైన అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు లేకపోవడం వల్ల బీ సి లు రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బీసీలు రాజకీయంగా భవిష్యత్తులో ముందుకు వెళ్లాలంటే పెద్ద ఎత్తున చట్టసభలలో బిల్లు తీసుకువచ్చి బీసీలకు ప్రత్యేకమైన రాజకీయ అవకాశాలు కల్పించే విధంగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలలో రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి, మండల స్థాయి నామినేటెడ్ పోస్టులలో బీసీలకు సముచితమైన స్థానం ఇవ్వాలనిఅన్నారు. గత కొన్ని ఏళ్లుగా బీసీలు రాజకీయంగా వెనుకబడి పోతున్నారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బీసీలకు న్యాయం చేసే విధంగా ప్రయత్నం చేయాలనిఅన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గడప కొటేష్ కుమార్, జిల్లా నాయకులు వెంకటేష్, మల్లేశం, వేణు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.




## బీసీఎంఐ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**బలగం టీవీ, బోయినిపల్లి**

వేసవిలో ప్రజల దహార్తి తీర్చేందుకు కొదురుపాక బిసిఎంఐ ట్రస్ట్ ఆధ్వర్యంలో బోయినిపల్లి మండలం కొదురుపాకలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొదురుపాక స్వగ్రామానికి చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ వైరాగ్యం రాజలింగం రీటా బహదూర్ షా దంపతులు వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో, ప్రజల దాహార్తి తీర్చేందుకు కొదురుపాక అడ్డా రోడ్డు వద్ద గత నాలుగు సంవత్సరాలుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం కొదురుపాక ఎక్స్ రోడ్డు వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు.వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదురుపాక యువత, తదితరులు పాల్గొన్నారు.




## రెట్రో ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

కోలీవుడ్ స్టార్ నటుడు సూర్య లీడ్ రోల్‌లో డైరెక్టర్ కార్తిక్ సుబ్బరాజు కాంబోలో తెరకెక్కిన లేటెస్ట్ మూవీ 'రెట్రో'. పూజా హెగ్డే హీరోయిన్. మే 1న గ్రాండ్‌గా ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ శుక్రవారం ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌లోనే ట్రైలర్ విడుదల చేశారు. ఇందులో సూర్య మాస్ అవతార్‌లో కనిపించనున్నారు. ఇది ఓ గ్యాంగ్‌స్టర్ లవ్ స్టోరీ అని ట్రైలర్ చూస్తే అర్థం అవుతోంది. ట్రైలర్ చివర్లో 'నిజమైన యుద్ధం వస్తోందని ఎదురుచూస్తున్నాం', 'ముద్దుల కొడుకా, డాడీ ఈజ్ కమింగ్ రా' అనే డైలాగ్స్ ఆకట్టుకుంటున్నాయి కాగా, ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ అదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించగా, జయరామ్, ప్రకాశ్ రాజ్, నాజర్, జోజూ జార్జ్ సహా పలువురు స్టార్స్ ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్, స్టోన్ బీచ్ బ్యానర్స్‌పై జ్యోతిక, సూర్య, కార్తికేయన్, కల్యాణ్ ఈ మూవీని నిర్మిస్తున్నారు.

## నాకు గుడి కట్టండి...

- **వింత కోరిక కోరిన ఊర్వశి రౌతేలా**

**బలగం టీవీ, హైదరాబాద్**



బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలా ఓ వింత కోరికతో మరోసారి వార్తల్లో నిలిచారు. ఉత్తరాఖండ్‌లో తన పేరు మీద ఆలయం ఉందని తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అంతేకాదు దక్షిణాదిలోనూ తన కోసం ఓ గుడి కట్టాలని ఆకాంక్షించారు. దీనితో ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి

ఇటీవల ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఊర్వశి రౌతేలా మాట్లాడుతూ, "నార్త్ ఇండియాలో నా పేరు మీద ఒక గుడి ఉంది. బద్రీనాథ్ టెంపుల్ పక్కన ఉన్న ఊర్వశి టెంపుల్ నా కోసం కట్టారు. అలాగే టాలీవుడ్‌లో చిరంజీవి సినిమాతో ఎంట్రీ ఇచ్చి, వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు రావడంతో నాకు ఇక్కడ కూడా అభిమానులు ఏర్పడ్డారు. ఉత్తరాదిలో లాగే దక్షిణాదిలో కూడా నా అభిమానులు గుడి కట్టాలని కోరుకుంటున్నాను," అని అన్నారు. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు క్షణాల్లో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆమె ఆత్మవిశ్వాసాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు ఆమె వ్యాఖ్యలు అతిశయోక్తిగా ఉన్నాయని, ఇలాంటి వ్యాఖ్యలు సరికాదని విమర్శిస్తున్నారు.



## 'దూరదర్శిని' నుంచి 'అపనా తనామనా' లిరికల్ సాంగ్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

సువిక్షిత్ బొజ్జ, గీతిక రతన్ జంటగా నటిస్తున్న చిత్రం 'దూరదర్శని'. కలిపింది ఇద్దరిని అనేది ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకుడు. వారాహ మూవీ మేకర్స్ పతాకంపై బి.సాయి ప్రతాప్ రెడ్డి, జయ శంకర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోంది.

1990వ నేపథ్యంలో అందరి హృదయాలను హత్తుకునే ప్రేమకథగా ఈ చిత్రం రూపొందుతుంది. ఇటీవల విడుదలైన ఈ చిత్రం టైటిల్ టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. దీంతో పాటు నానీడ వెళుతుందా అనే లిరికల్ వీడియో సాంగ్‌కు కూడా అనూహ్యమైన ప్రశంసలు లభించాయి. తాజాగా ఈ చిత్రం నుంచి 'అపనా తనామనా'ే లిరికల్ వీడియోను దర్శకుడు సుకుమార్ విడుదల చేశారు. సింధుజ, శ్రీనివాసన్ ఆలపించిన ఈ బ్యూటిఫుల్ సాంగ్‌కు సురేష్ బనిశెట్టి సాహిత్యం అందించారు. ఆనంద్ గుర్రాన బాణీలు సమకూర్చారు.

# చిన్నస్వామిలో ఆర్సీబీకి మరో ఓటమి

- **బ్యాటింగ్‌లో కుప్పకూలిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు**
- **స్వల్ప లక్ష్యాన్ని చేధించిన పంజాబ్**



**బలగం టీవీ, బెంగళూరు**

ఆర్సీబీపై పంజాబ్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వర్షం కారణంగా 14 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బౌలింగ్ చేసిన పంజాబ్ ఆర్సీబీని 95 పరుగులకే (9 వికెట్ల నష్టానికి) కట్టడి చేసింది. అనంతరం పంజాబ్ 12.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది.

టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన ఆర్సీబీకి మంచి శుభారంభం దక్కలేదు. 5 ఓవర్లలో 33 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయింది. ఫిల్ స్టాల్ట్ , విరాట్ కోహ్లీ, లివింగ్ స్టోన్, జితేశ్ శర్మ వరుసగా పెవిలియన్ చేరారు. తొలి ఓవర్ లోనే అర్షదీప్ బౌలింగ్ లో మొదటి బంతికి బౌండరి బాదిన సాల్ట్ (4).. తర్వాత వికెట్ కీపర్ ఇంగ్లిస్ కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఆ తర్వాత అర్షదీప్ బౌలింగ్ లో కోహ్లీ 1 పరుగుకే పెవిలియన్ చేరాడు. అనంతరం జేవియర్ బార్ట్ లెట్ బౌలింగ్ లో 3.6 ఓవర్ వద్ద ప్రియాంశ్ ఆర్యకు క్యాచ్ ఇచ్చి లివింగ్ స్టన్ (4) మూడో వికెట్ గా వెనుదిరిగాడు. చాహల్ బౌలింగ్ లో భారీ షాట్ కు యత్నించి నేహాల్ వధెరాకు క్యాచ్ ఇచ్చి జితేశ్ శర్మ(2) నాలుగో వికెట్ గా ఔట్ అయ్యాడు. అనంతరం మార్క్ ఎస్ఎన్ బౌలింగ్ లో 8.2 ఓవర్ దగ్గర మనోజ్ భాండగే (1) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. భువనేశ్వర్ కుమార్ (8) కూడా ఔట్ అవ్వగా.. యశ్ దయాళ్ ఎల్బీడబ్ల్యూగా క్రీజును వదిలాడు. ఆఖర్లో టిమ్ డేవిడ్ (50) తన బ్యాటును ఝుళిపించాడు. 26 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సుల సాయంతో దూకుడు ప్రదర్శించాడు. దీంతో ఆర్సీబీ 14 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. పంజాబ్ బౌలర్లలో అర్షదీప్ సింగ్, మార్కో జాన్సన్, పెద్ద స్వామి చాహల్, హర్ప్రీత్ బ్రార్ తలో రెండు వికెట్లు తీశారు. బార్లెట్ ఓ వికెట్ దక్కించుకున్నాడు

అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పంజాబ్ కూడా తడబడుతూ బ్యాటింగ్ చేసింది. ప్రియాంశ్ ఆర్య 16, ప్రభ్‌సిమ్రన్ సింగ్ 13, శ్రేయస్ అయ్యర్ 7, జోస్ ఇంగ్లిస్ 14, శశాంక్ సింగ్ 1 పరుగు చేసి ఔటయ్యారు. అయితే నేహాల్ వధేరా (33 నాటౌట్) అద్భుతంగా బ్యాటింగ్ చేసి పంజాబ్‌ను విజయతీరాలకు చేర్చాడు. యశ్ దయాల్ బౌలింగ్‌లో సిక్సర్ బాది స్టోయినిస్ (7 నాటౌట్) మ్యాచ్‌ను ముగించాడు. ఆర్సీబీ బౌలర్లలో హాజిల్‌వుడ్ 3 వికెట్లు తీయగా.. భువనేశ్వర్ కుమార్ 2 వికెట్లు పడగొట్టాడు.



## శబరిమల అయ్యప్పను దర్శించుకున్న నటులు కార్తి, జయం రవి

**బలగం టీవీ, హైదరాబాద్**

తమిళ నటులు కార్తి , జయం రవి శబరిమలలో కొలువైన అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. అయ్యప్ప మాల వేసుకున్న కార్తి, జయం రవిలు గురువారం రాత్రి ఇరుముడితో శబరిమలకి వెళ్లి మణికం ఠుడిని దర్శించుకున్నారు. దర్శనానంతరం కార్తి మాట్లాడుతూ.. తాను తొలిసారి స్వామి మాల వేసుకుని శబరిమలకి వచ్చానని.. ఈ అనుభవం తనకు మానసిక శాంతిని, బలాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. కన్నె స్వామి(అయ్యప్ప మాల మొదటిసారి వేసుకున్నవారు)గా ఇక్కడికి రావడం నాకు చాలా సంతోషంగా ఉంది. పవళింపు సేవలో స్వామి వారిని దర్శించుకోవడం ఒక ప్రత్యేకమైన అనుభూతినిచ్చింది. భవిష్యత్తులో కూడా స్వామి వారి దర్శనానికి రావాలని కోరుకుంటున్నాను అని కార్తి మీడియాతో అన్నారు. జయం రవి మాట్లాడుతూ.. తాను ఇదివరకే చాలాసార్లు శబరిమల ఆలయాన్ని సందర్శించానని తెలిపారు. "నేను 2015 నుండి ఇక్కడికి వస్తున్నాను. ఇప్పటివరకు దాదాపు తొమ్మిదిసార్లు శబరిమలను దర్శించుకున్నాను. స్వామిపై నాకు ఎంతో నమ్మకం ఉంది. నా జీవితంలో చాలా మంచి జరిగిందని తెలిపారు.



**నటి కీర్తి సురేశ్ ఆంధ్రప్రదేశ్ విజయవాడలో సందడి చేశారు. నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఓ షాపింగ్ మాల్ ఓపెనింగ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కీర్తి సురేశ్‌ను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నటితో సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు.**



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న వీవీఎస్ లక్ష్మణ్

**బలగం టీవీ, హైదరాబాద్**

కలియుగదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని భారత మాజీ క్రికెటర్, నేషనల్ క్రికెట్ అకాడమీ ప్రధాన కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న క్రికెటర్‌కు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేసి శాలువాతో సత్కరించారు. స్వామి వారి తీర్థప్రసాదాలు, చిత్ర పటం అందజేశారు.

## సన్నీ డియోల్, రణ్‌దీప్ హుడాపై కేసు నమోదు

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ సీనియర్ హీరో సన్నీ డియోల్ నటించిన తాజా చిత్రం 'జాట్' వివాదంలో చిక్కుకుంది. ఈ మూవీలో నటించిన సన్నీ డియోల్‌తో పాటు రణ్‌దీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్‌పై కేసు నమోదైంది. జాట్ సినిమాలోని ఓ సన్నివేశంలో మతపరమైన మనోభావాలను దెబ్బతీశారనే ఆరోపణలపై తాజాగా జలంధర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ఈ చిత్రాన్ని టాలీవుడ్ దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన విషయం తెలిసిందే. దీంతో ఆయనతో పాటు నిర్మాతలపైన కూడా కేసు పెట్టారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 299 ప్రకారం కేసు నమోదైనట్లు సమాచారం. ఇక, ఏప్రిల్ 10న విడుదలైన జాట్ చిత్రంలో ఓ మతానికి సంబంధించిన వారి మనోభావాలు దెబ్బతీసే రీతిలో ఓ సన్నివేశం ఉన్నట్లు ఫిర్యాదుదారుడు తెలిపారు. దేశంలో అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేశారని, అందుకే దర్శకుడు, నిర్మాత, రచయితపై కేసు పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇక ఈ యాక్షన్ చిత్రంలో వినీత్ కుమార్ సింగ్, సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా, ప్రశాంత్ బజాజ్, జరీనా వహాబ్, రమ్యకృష్ణ, జగపతి బాబు వంటి భారీ తారాగణం నటించారు. రణదీప్ హుడా ప్రతినాయకుడిగా కనిపించారు. ఈ చిత్రం హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదలైంది.